# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 217. ఎడిటర్: సింగిడి అమృత్ తెలంగాణ శుక్రవారం.16.05.2025 పేజీలు:4, వెల:రూ.1.00


## చల్లని కబురు

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో శుక్రవారం కూడా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న హెచ్చరించారు. ఈ మేరకు జగిత్యాల, నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, మెదక్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక జారీ చేశారు. అదే సమయంలో వచ్చే ఐదు రోజుల పాటు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే అవకాశముందని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వచ్చే 48 గంటల పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుందనీ, సాయంత్రం, రాత్రి సమయాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వానలు, చిరుజల్లులు పడే సూచనలున్నాయని తెలిపారు.

## సింగరేణి ఓసీపీ-2లో భారీ బ్లాస్టింగ్

రామగిరి :అమృత్ తెలంగాణ: పెద్దపల్లి జిల్లా సింగరేణి రామగుండం-3 డివిజన్ పరిధిలోని ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్-2 క్వారీ పక్కన ఉన్న ఎల్-6 కెనాల్‌లో గురువారం మధ్యాహ్నం పెద్దఎత్తున బ్లాస్టింగ్ జరిగింది. దాంతో సమీపంలోని నాగపల్లి గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. భారీ పేలుడు ధాటికి బండరాళ్లు ఎగిరి ఇండ్లపై పడటంతో ఆస్తి నష్టం సంభవించడమే కాకుండా, పలువురికి గాయాలయ్యాయి. బ్లాస్టింగ్ శబ్దానికి భూమి కంపించడంతో ఏం జరుగుతుందో తెలియక జనం పరుగులు తీశారు. పెద్దపెద్ద బండరాళ్లు ఇండ్లపై పడటంతో రేకులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. సింగరేణి అధికారులు పేలుడు పదార్థాల మోతాదు పెంచి బ్లాస్టింగ్ చేపట్టడమే ఈ ఘటనకు కారణమని ఆరోపించారు. నిత్యం జరుగుతున్న బ్లాస్టింగ్‌ల వల్ల గ్రామంలో ఉండలేకపోతున్నామని ఆవేదన చెందారు. ఈ బ్లాస్టింగ్‌లకు నిరసనగా గ్రామస్తులంతా ప్రధాన రహదారిపైకి చేరుకొని బైటాయించి రాస్తారోకో చేపట్టారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్తులను సముదాయించే ప్రయత్నం చేశారు.

# ప్రయాణికులకు మెట్రో షాక్




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: ప్రయాణికులకు హైదరాబాద్ మెట్రో రైల్ షాకిచ్చింది. భారీగా మెట్రో చార్జీలను పెంచేసింది. ఐటీ ఉద్యోగులు, ప్రయివేట్ ఎంప్లాయిస్‌తోపాటు నిత్యం మెట్రో రైల్‌లో ప్రయాణించేవారికి పెరిగిన చార్జీలు భారం కానున్నాయి. ఎల్అండ్‌టీ మెట్రో సంస్థ మెట్రో రైలు కనీస చార్జి రూ.10 నుంచి రూ. 12కు, గరిష్ట చార్జి రూ.60 నుంచి రూ.75కు పెంచింది. పెరిగిన మెట్రో చార్జీలు రేపటి(ఈ నెల 17) నుంచి అమల్లోకి రానున్నాయని ఎల్అండ్‌టీ సంస్థ గురువారం ప్రకటించింది. మెట్రో రైల్వేస్ చట్టం 2002లోని సెక్షన్ 34 ప్రకారం.. చార్జీల సవరణ స్వరూపాన్ని సిఫార్సు చేసేందుకు హైకోర్టు మాజీ జడ్జి సారథ్యంలో ఫేర్ ఫిక్సేషన్ కమిటీ(ఎఫ్ఎఫ్‌సీ) ఏర్పాటైందని, ఫేర్ ఫిక్సేషన్ కమిటీ 25 జనవరి 2023న సవరించిన చార్జీల స్వరూపాన్ని సిఫార్సు చేస్తూ నివేదికను సమర్పించిందని తెలిపింది. మెట్రో రైల్వే ఓఅండ్ఎం చట్టంలోని సెక్షన్ 37 ప్రకారం.. ఫేర్ ఫిక్సేషన్ కమిటీ చేసిన సిఫార్సుల మేరకు చార్జీలు పెంచినట్టు చెప్పింది. నాణ్యమైన సేవలు అందించేందుకు చార్జీల సవరణ ఉపయోగ పడు తుందని మెట్రో రైల్ అధికారులు తెలిపారు. ఇందుకు ప్రయాణికులు సహకరించాలని ఎల్అండ్‌టీ సంస్థ విజ్ఞప్తి చేసింది.

నష్టాలు.. అప్పులను సాకుగా చూపుతూ..

హైదరాబాద్ నగరంలో ఎల్‌బీనగర్-మియాపూర్, నాగోల్- రాయదుర్గం, జేబీఎస్- ఎంజీబీఎస్ మూడు కారిడార్లు కలిపి రోజుకు 5 లక్షల మంది వరకు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే, గతంలో కరోనా, ఇతర కారణాలతో మెట్రో నష్టాల్లో నడిచిందని అధికారులు చెబుతున్నారు. ఆ నష్టాలను పూరించేందుకు టికెట్ల రేట్లను పెంచడం, లేదా ప్రభుత్వం ఆర్థికంగా అదుకోవడమే మార్గమని పలుమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్టు మెట్రో అధికారులు తెలిపారు. కరోనా దెబ్బకు మెట్రో ప్రయాణీకుల సంఖ్య తగ్గి.. ఆర్థిక భారం పెరిగి అది ప్రస్తుతం రూ.6500కోట్లకు పెరిగినట్టు మెట్రో అధికార వర్గాల సమాచారం. దీనికి తోడు మెట్రో నిర్మాణ సమయంలో తెచ్చిన అప్పుల అధిక వడ్డీల చెల్లింపులకే ఎక్కువ శాతం కేటాయిస్తున్నట్టు పలుమార్లు చెప్పారు. అయితే, హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్ట్ కోసం ప్రభుత్వం సుమారు 267 ఎకరాల భూమిని ఇచ్చింది. ఈ భూమి మెట్రో స్టేషన్లు, డిపోలు, పార్కింగ్ సౌకర్యాలు, ట్రాన్సిట్ ఓరియెంటెడ్ డెవలప్‌మెంట్(టీవోడీ) కోసం ఉపయోగించి ఆదాయం సమకూర్చుకోవాలి. అయితే, కొన్ని చోట్లనే ప్రభుత్వం ఇచ్చిన భూమిని మెట్రో డెవలప్ చేసి కమర్షియల్ కాంప్లెక్సులు నిర్మించినట్టు తెలుస్తోంది. 267 ఎకరాలను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటే ఆర్థికభారం కొంతైనా తగ్గే అవకాశం ఉండేదని అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆస్తులను వదిలేసి టికెట్ల రేట్లు పెంచి జనాల జేబులకు చిల్లులు పెట్టడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

సర్కారు అనుమతి లేకుండానే..

మెట్రో రైల్వే(ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) యాక్ట్ 2002 ప్రకారం రేట్లను సవరించినట్టుగా ఎల్అండ్‌టీ మెట్రో తెలిపింది. ఈ చట్టం ప్రకారం మెట్రో రైల్ అడ్మినిస్ట్రేషన్ (ఎంఆర్ఎ) ప్రారంభ చార్జీలను నిర్ణయించే అధికారం కలిగి ఉంటుంది. ఎల్అండ్‌టీ, మెట్రో రైల్ హైదరాబాద్ లిమిటెడ్ (ఎంఆర్‌హెచ్ఎల్) హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టులో కన్సెషసర్‌గా, ఎమ్ఆర్ఎగా వ్యవహరిస్తుంది. 2017లో ముంబయి హైకోర్టు.. మెట్రో రైలు రేట్ల విషయంలో కన్సెషనర్‌కు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. దీని ఆధారంగా హైదరాబాద్ మెట్రోలో ఎల్అండ్‌టీ కూడా రేట్ల నిర్ణయంలో స్వతంత్రతను పొందింది. అయితే, మెట్రో స్వతంత్రంగా రేట్లను పెంచుకోవాలంటే ఎఫ్ఎఫ్‌సీ సిఫారసు అవసరం. 2022లో మెట్రో టికెట్ రేట్లను పెంచాలని ప్రభుత్వాన్ని కోరినప్పుడు ఎఫ్ఎఫ్‌సీ ఏర్పాటు చేసింది. ఆ కమిటీ ఇన్‌ఫ్లేషన్, హోల్‌సేల్ ప్రైస్ ఇండెక్స్, ఎల్అలండ్‌టీ ప్రతిపాదనలను అధ్యయనం చేసి, 2023లో రేట్ల సవరణను సిఫార్సు చేసింది. ఎఫ్ఎఫ్‌సీ ఆమోదం పొందితే మెట్రో ధరల పెంపునకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుమతి లేకున్నా అమలు చేయొచ్చు. ఆ మేరకే ఎల్అండ్‌టీ సంస్థ ముందుకు వెళ్తోంది.

చార్జీల పెంపును విరమించుకోవాలి : సీపీఐ(ఎం) డిమాండ్

హైదరాబాద్ మెట్రో రైల్ చార్జీల పెంపుతో సామాన్య జనంపై తీవ్రమైన భారం పడుతుందని.. వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎల్ అండ్‌టీ మెట్రో రైల్ సంస్థకు ఆర్థిక నష్టాలు వస్తున్నాయని, అందుకే టికెట్ల రేటు పెంచాల్సి వస్తున్నదని ఆ సంస్థ చెప్పడం సరికాదన్నారు. 50 శాతం టికెట్ ద్వారా, 50 శాతం రియల్ ఎస్టేట్ ద్వారా ఆదాయం సమకూర్చుకోవాలని ఒప్పందంలో రాసుకున్నారని, కానీ రియల్ ఎస్టేట్ ద్వారా 10 నుంచి 15 శాతం కూడా ఆదాయం రాబట్టుకోలేకపోవడం ఎల్అండ్‌టీ సంస్థ వైఫల్యమని పేర్కొన్నారు. తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకొని ప్రజలపై టికెట్ చార్జీల భారం పెంచడం ఏ రకంగానూ సమంజసం కాదన్నారు. ఫేర్ ఫిక్సేషన్ కమిటీ నివేదిక మేరకే పెంచుతున్నట్టు ఎల్అండ్‌టీ చెబుతున్నా.. ఆ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికైనా అందించారా? కేంద్ర ప్రభుత్వం కూడా తమకు నివేదిక అందలేదని చెబుతున్నదని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆమోదం లేకుండానే ఈ చార్జీలు పెంపుదల ఎలా చేస్తారని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకొని మెట్రో రైల్ చార్జీల పెంపుదలను తక్షణమే నిలుపుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

పెరిగిన చార్జీల వివరాలు

మొదటి రెండు స్టాప్‌లకు రూ.12
2 నుంచి 4స్టాప్‌ల వరకు రూ.18
4 నుంచి 6స్టాప్‌ల వరకు రూ.30
6 నుంచి 9స్టాప్‌ల వరకు రూ.40
9 నుంచి 12స్టాప్‌ల వరకు రూ.50
12 నుంచి 15స్టాప్‌ల వరకు రూ.55
15 నుంచి 18స్టాప్‌ల వరకు రూ.60
18 నుంచి 21స్టాప్‌ల వరకు రూ.66
21 నుంచి 24స్టాప్‌ల వరకు రూ.70
24 స్టాప్‌లు.. ఆపైన రూ.75

# వక్ఫ్ సవరణ చట్టంపై మే 20కి విచారణ వాయిదా : సుప్రీంకోర్టు



హైదరాబాద్: అమృత్ తెలంగాణ: వక్ఫ్ సవరణ చట్టం 2025 రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌లపై మే 20న విచారణ చేపడతామని సుప్రీంకోర్టు గురువారం వెల్లడించింది. ఈ కేసులో మధ్యంతర ఉపశమనం అవసరమా కాదా అని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ ఎ.జి.మసిహ్‌లతో కూడిన ధర్మాసనం పరిశీలించనుంది. అప్పటివరకు, కేంద్ర ప్రభుత్వం చట్టంలోని నిబంధనలు అమలు చేయదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఇచ్చిన హామీ కొనసాగుతుందని ధర్మాసనం తెలిపింది. ఈ పిటిషన్‌ల విచారణ నుండి భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా తప్పుకున్న సంగతి తెలిసిందే. ఈ నెల 13న తాను పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ఈ అంశంపై ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులను జారీ చేయాలనుకోవడం లేదని లేదా రిజర్వ్ చేయాలని కూడా అనుకోవడం లేదని మే 5న విచారణ సందర్భంగా జస్టిస్ సంజీవ్ ఖన్నా వ్యాఖ్యానించారు. ఈ వక్ఫ్ సవరణ చట్టాన్ని సవలు చేస్తున్న పిటిషన్‌లపై తదుపరి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ బి.ఆర్.గవారు నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపడుతుందని అన్నారు. విచారణను నేటికి వాయిదే వేశారు.

# మతాన్ని రాజకీయాలకు వాడుకోవద్దు: మంత్రి సీతక్క



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: మతాన్ని రాజకీయాలకు వాడుకోవద్దని, మానవత్వంతో కూడిన మతాన్ని ప్రజలు ఇష్టపడతారని మంత్రి సీతక్క అన్నారు. సికింద్రాబాద్ లోని హరిహర కళాభవన్ దహించు అగ్ని మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో పరిశుద్ధాత్మ అగ్ని సదస్సులు పేరుతో జరుగుతున్న యూత్ మీటింగ్స్ కు మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మతానికి మానవత్వం జోడిస్తేనే లోక కల్యాణం అవుతుందన్నారు. మతాలు వేరైనా, దేవుళ్లు వేరైనా ఎవరి విశ్వాసాలు వారివని ఎవరి విశ్వాసాలను వారు నమ్ముతూ సాటి మనిషిని ప్రేమించాలని ఆమె అన్నారు. మనదేశం లౌకిక రాజ్యాంగంగా పెద్దలు నిర్మించారని, ఇక్కడ అన్ని మతాల పట్ల సమాన గౌరవం ఉంటుందన్నారు. మత సంస్థలు మత ప్రచారానికే పరిమితం కాకుండా ప్రజల సౌఖ్యం, ఆరోగ్యం కోసం పాటు పడాలని మనం చేసే సేవ వెయ్యేండ్లు ప్రజలు గుర్తు పెట్టుకోవాలని ఆమె సూచించారు. మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు బిషప్ డాక్టర్ థామస్ మాట్లాడుతూ తెలంగాణ, ఏపీలో సంఘాలతో కేవలం యేసు క్రీస్తు సువార్తనే కాకుండా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. పేదలకు అన్నదానం,వితంతువులకు కుట్టు శిక్షణ, కుట్టు మిషన్ల పంపిణీ, అనాథ పిల్లలకు ఉచిత విద్య, యువతులకు వివాహలు జరిపిస్తామన్నారు. చెడు అలవాట్లకు బానిసైన యువతకు కౌన్సిలింగ్ నిర్వహించి సమాజంలో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతామన్నారు. ఈనెల 17వ తేదీ వరకు ఈ సదస్సులు జరుగుతాయని చెప్పారు.

పీస్ అంబాసిడర్ అవార్డు

దహించు అగ్ని మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు చేస్తున్న బిషప్ డాక్టర్ థామస్ కు అమెరికా యూనివర్శిటీ అందించిన పీస్ అంబాసిడర్ అవార్డును మంత్రి సీతక్క ఆయనకు బహూకరించారు. ఈ కార్యక్రమంలో షీబా థామస్,మోజస్,డేవిడ్, జీవన్ డిస్నూ,అశోక్,జాయ్ తదితరులు పాల్గొన్నారు.

# ‘అమ్మమాట..అంగన్‌వాడీ బాట’ నినాదంతో ముందుకు

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: ‘అమ్మమాట..అంగన్‌వాడీ బాట’ నినాదంతో ముందుకు సాగాలనీ, అంగన్‌వాడీ కేంద్రాలను చిన్నారుల చిరునవ్వుకు చిరునామాగా తీర్చిదిద్దాలని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతంపై జిల్లాలవారీగా సమీక్ష నిర్వహించారు. అందులో మంత్రితో పాటు మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ క్రాంతి వెస్లీ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ..కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి అంగన్‌వాడీ కేంద్రాలను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలన్నారు. మూడేండ్ల నుంచి ఆరేండ్ల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. బడీడు పిల్లలు బడిలో, చిన్న వయస్సు పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్లేస్కూళ్లకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాలను తీర్చిదిద్దాలనీ, వాటిలోని సౌకర్యాల గురించి చెబుతూ వారికి నమ్మకం కలిగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పిల్లల్లో పోషకాహార లోపం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత డీడబ్ల్యూఓలదే అని నొక్కి చెప్పారు.






# త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు




హైదరాబాద్: అమృత్ తెలంగాణ: తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో సరస్వతీ నది పుష్కరాలు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గోదావరి, ప్రాణహిత నదులతో పాటు అంతర్వాహినిగా ప్రవహించే సరస్వతీ నది కలిసే త్రివేణి సంగమం వద్ద ఈ పుష్కర వేడుకలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పుష్కరాల్లో పాల్గొన్నారు. గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తదితరులు పవిత్ర త్రివేణి సంగమంలో పుష్కర స్నానం ఆచరించారు. అనంతరం నదీమతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి, హారతి సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నూతనంగా ప్రతిష్ఠించిన 10 అడుగుల సరస్వతీదేవి విగ్రహాన్ని, భక్తుల సౌకర్యార్థం నిర్మించిన 86 గదుల నూతన వసతి సముదాయాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. జ్యోతిష్య శాస్త్రం ప్రకారం, బృహస్పతి (గురువు) మిథున రాశిలోకి ప్రవేశించడంతో సరస్వతీ నదికి పుష్కరాలు వస్తాయి. బుధవారం రాత్రి 10.35 గంటలకు బృహస్పతి మిథున రాశిలోకి ప్రవేశించి పుష్కర కాలం ఆరంభమైనప్పటికీ, కాళేశ్వరం ఆలయ అర్చకుల సూచన మేరకు గురువారం సూర్యోదయం నుంచి భక్తులు పుష్కర స్నానాలు ఆచరించడం మొదలుపెట్టారు. గురువారం వేకువజామున 5.44 గంటలకు శ్రీగురు మదనానంద సరస్వతి పీఠాధిపతి మాధవానంద సరస్వతి సరస్వతి ఘాట్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి పుష్కరాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ పుష్కరాలు ఈ నెల 26వ తేదీ వరకు కొనసాగుతాయి. పుష్కరాల సందర్భంగా ప్రతిరోజూ సాయంత్రం 6.45 గంటల నుంచి 7.35 గంటల వరకు సరస్వతి ఘాట్ వద్ద సరస్వతి నవరత్న మాల హారతి కార్యక్రమం నిర్వహిస్తారు. దీంతో పాటు వివిధ కళా, సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేశారు. భక్తుల వసతి కోసం రుసుము చెల్లించి బస చేసేందుకు వీలుగా తాత్కాలిక టెంట్ సిటీని కూడా నిర్మించారు.

పుష్కరాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.35 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో భక్తులకు తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య నిర్వహణ, స్నానఘట్టాల నిర్మాణం, రహదారుల మరమ్మతులు, వాహనాల పార్కింగ్ వంటి విస్తృతమైన ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కాళేశ్వరానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతోంది. పుష్కరాల సమయంలో ప్రతిరోజూ సగటున లక్షన్నర మంది భక్తులు వస్తారని దేవాదాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

## జిల్లాలో రాష్ట్ర మంత్రుల పర్యటనకు పటిష్ట భద్రత

సిరిసిల్ల :అమృత్ తెలంగాణ: రుద్రంగి మండలంలో రాష్ట్ర మంత్రుల బృందం పర్యటన నేపథ్యంలో పటిష్ట భద్రత ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ మహేష్ బి గితే పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో గురువారం సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేసిన అనంతరం ఎస్పి మాట్లాడుతూ సభ ప్రాంగణంలో, విఐపి/జనరల్ గ్యాలరిలో, రూట్ బందోబస్తు,విఐపి పార్కింగ్/జనరల్ పార్కింగ్ ప్రదేశలలో బందోబస్తులో ఉన్న అధికారులు,సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి,అదనపు ఎస్పీ చంద్రయ్య,సిరిసిల్ల డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ మురళి కృష్ణ, డి సి ఆర్ బి డిఎస్పీ శ్రీనివాస్,సి.ఐ లు మొగిలి, శ్రీనివాస్, వీరప్రసాద్, వెంకటేశ్వర్లు, మధుకర్, నాగేశ్వరరావు,స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,ఆర్.ఐలు రమేష్, మధుకర్ లు పాల్గొన్నారు.

# సిరాల ప్రాజెక్టు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే.. వచ్చే ఖరీఫ్ నుండి రైతాంగానికి సాగునీరు..




సిరాల ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

నిర్మల్ జిల్లా సిరాల మే 15 అమృత్ తెలంగాణ సిరాల ప్రాజెక్టు పనులను ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ గురువారం పరిశీలించారు. 12 కోట్ల రూపాయల నిధులతో చేపట్టనున్న పనులు 90% పూర్తి కావడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చే ఖరీఫ్ నుండి రైతాంగానికి సాగునీరు అందించేందుకు కృషి చేస్తానన్నారు. భారీ వర్షాలతో సి రాల ప్రాజెక్టు కట్ట తెగిపోవడంతో తాను ఎమ్మెల్యే అయ్యాక ప్రభుత్వం ప్రాజెక్టు పునర్నిర్మాణానికి 12 కోట్ల రూపాయల నిధులు విడుదల చేసిందన్నారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే సిరాల, ఇలేగామ్, దేగాం, తో పాటు ఆయా గ్రామాల రైతులకు సాగునీరు అందుతుందన్నారు. పనులు పూర్తిచేసిన వైష్ణవి కన్స్ట్రక్షన్స్ యజమాన్యానికి ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. రైతుల సమస్యను దృష్టిలో ఉంచుకొని ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, నేటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి, జిల్లా ఇన్చార్జ్ మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు చెప్పారు. ప్రాజెక్ట్ పూర్తి చేసినందుకు ఆయకట్టు రైతులు ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు చెప్పారు..ఎమ్మెల్యే వెంట ఇరిగేషన్ డి. ఇ. అనిల్ మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, సీనియర్ నాయకులు సంప్లీ రమేష్, బిజెపి మండల అధ్యక్షురాలు సిరం సుష్మరెడ్డి, నాయకులు పండిత్ రావ్, జిల్లా కార్యవర్గ సభ్యులు భూమేష్, ఆయా గ్రామాల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు..

# బాసరలో కేంద్రీయ విద్యాలయ నిర్మాణం కోసం స్థలం, తాత్కాలిక భవన పరిశీలన

## ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించాలన్న ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నిర్మల్ జిల్లా బాసర మే 15 అమృత్ తెలంగాణ సరస్వతి అమ్మవారి సన్నిధిలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఆ దశగా ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. అందులో భాగంగానే గురువారం కేంద్రీయ విశ్వవిద్యాలయాల డిప్యూటీ కమిషనర్ డాక్టర్ మంజునాథ్ భవన నిర్మాణం కోసం స్థలం, ప్రస్తుతం విద్యాలయం ప్రారంభం కోసం తాత్కాలిక భవనాన్ని పరిశీలించారు. ఉదయం నుండి రెండు మూడు గంటల పాటు డిప్యూటీ కమిషనర్, ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ లు బాసరలో ఇదే పనుల్లో నిమగ్నమయ్యారు. త్రిబుల్ ఐటీ సమీపంలో తాత్కాలిక భవనంతో పాటు, అదేవిధంగా బాసర గోదావరి నదికి వెళ్లే దారిలో మరో భవనాన్ని పరిశీలించారు. స్థలాన్ని పరిశీలించి అధికారులు పలు సూచనలు ఇచ్చారు. విద్యార్థులకు సౌకర్యంగా ఉండే తాత్కాలిక భవనం, అనువైన స్థలం కావాలని డిప్యూటీ కమిషనర్ తెలిపారు. ఈ విషయంలో ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ సానుకూలంగా స్పందించారు. అనంతరం అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. అందరి సహకారంతో త్వరలో కేంద్రీయ విద్యాలయం ప్రారంభమవుతుందని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. డిప్యూటీ కమిషనర్ తో పాటు, అసిస్టెంట్ కమిషనర్ అనురాధ, నిర్మల్ ఆర్. డి. వో, రత్నమాల, జిల్లా విద్యాశాఖ అధికారి రామరావ్ బాసర తహసిల్దార్ పవన్ చంద్ర, మాజీ జెడ్పిటిసిలు వసంత రమేష్, మాజీ ఎంపీపీ విశ్వనాథ పటేల్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, సతీశ్వర్ రావ్, మండల అధ్యక్షులు సాయినాథ్ పటేల్, నాయకులు ప్రతాప్ రావ్, శివాజీ, ముధోల్ మండల నాయకులు ఉన్నారు.

# రాంటేక్ లో కల్యాణ మండపాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతున్న ఎమ్మెల్యే



ఎమ్మెల్యే ను సన్మానిస్తున్న వీడిసి సభ్యులు

నిర్మల్ జిల్లా ముధోల్ మే 15అమృత్ తెలంగాణ ముధోల్ మండలం లోని రాంటేక్ గ్రామం లో శివాలయ సమీపంలో నిర్మించిన కల్యాణ మండపాన్ని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామఅభివృద్ధి కమిటి ఆధ్వర్యంలో ప్రశాంత వాతావరణం లో కళ్యాణమండపం నిర్మించడం అభినందనీయమన్నారు..గ్రామం లో సిసి రోడ్ల నిర్మాణానికి 24 లక్షల రూపాయల నిధులు కేటాయించడం జరిగిందన్నారు. అదే విధంగా మండపం, షెడ్డు కోసం ఐదులక్షల రూపాయల నిధులు ఇవ్వనున్నట్లు చెప్పారు. తక్షణమే ఆలయం వద్ద బోరు బావి వేయిస్తానన్నారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డు లు అందించేలా కృషి చేస్తానన్నారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ను గ్రామస్తులు ఘనంగా స్వాగతించి, శాలువాతో సత్కరించారు.. కార్యక్రమం లో మాజీ ఎం. పి. పి. నర్సాగౌడ్, మాజీ జడ్. పిటి. సి. సంప్లీ రమేష్, నాయకులు తాటివార్ రమేష్, సుదర్శన్, శ్రీనివాస్, శ్యామ్రావ్, భుజంగ్, తదితరులు ఉన్నారు..

# కష్టపడ్డా కార్యకర్తకే పార్టీ గుర్తింపు లభిస్తుంది - తాహిర్ బిన్ హమ్దన్

## పార్టీకి అంకితమై పనిచేసే వారు ముందుకు రావాలి - ఆడే గజేందర్




సమావేశంలో మాట్లాడుతున్న ఆడే గజేందర్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : బూతు స్థాయి నుండి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం ఇచ్చోడ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇచ్చోడ, గుడిహత్నూర్, సిరికొండ మండలాల కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహిర్ బిన్ హమ్దన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అబ్జర్వర్ చిట్లి సత్యనారాయణ హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాడర్ బేసిక్ ఎన్నికలే పార్టీకి పునాది అని, సామాజిక సమీకరణ సంస్థాగత నిర్మాణం ముఖ్యమన్నారు. రాబోయే సంస్థ గత ఎన్నికల్లో గెలుపు గుర్రాలకే ప్రజా ప్రతినిధులుగా పోటీ చేసే అవకాశం కల్పించనున్నట్లు వెల్లడించారు, ఆడే గజేందర్ గారు మాట్లాడుతూ క్యాడర్ బాగుంటే పార్టీ బాగుంటుంది అని ,కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతం సామాజిక న్యాయం మని అందులో భాగంగానే కులగనను చేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీలో క్యాడర్కు గౌరవం ఉందని, పార్టీ జెండా పట్టి పార్టీని గెలిపించే వారే నిజమైన కాంగ్రెస్ వాది అన్నారు.క్రింది స్థాయి నుండి వస్తేనే నాయకులుగా ఎదుగుతారని తెలిపారు. కష్టపడ్డా కార్యకర్తకే పార్టీ గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆడే గజేందర్, ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ కంది శ్రీనివాస్ రెడ్డి, పార్లమెంట్ ఇంచార్జి ఆత్రం సుగుణ డిసిసిబి బ్యాంక్ చైర్మన్ అడ్డి బోజ రెడ్డి, ఇచ్చోడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యవతి కోటేష్, వైస్ చైర్మన్ శేషారావు,కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, ఏఐసీసీ సభ్యులు నరేష్ జాదవ్, మాజీ జడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య, మాజీ AMC చైర్మన్ ఆడే శీల కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, ,యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు బద్దం పోతారెడ్డి , ఇచ్చోడ , గుడిహత్నూర్ , సిరికొండ మండలాల అధ్యక్షులు కళ్ళెం నారాయణ రెడ్డి, కరుణాకర్, ఇమామ్, నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు

# కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలం

## కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు తెలంగాణ ఉర్దూ అకాడమీ చైర్మన్



బోరంచు శ్రీకాంత్ రెడ్డి / ప్రశాంత్ రెడ్డి బ్రదర్స్ సన్మానిస్తున్న దృశ్యం



బోరంచు శ్రీకాంత్ రెడ్డి కార్యకర్తలు రుయ్యాడి గ్రామంలో సన్మానిస్తున్న దృశ్యం

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఇచ్చోడ, సిరికొండ, గుడిహత్నూర్, మూడు మండలాల ముఖ్య నాయకుల సమావేశం ఇచ్చోడ పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, మరియు తలమడుగు ,తాంసి, భీంపూర్ మూడు మండలాల కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం తలమడుగులోనీ రుయ్యాడిలో, మరియు బోథ్, నేరడిగొండ, బజార్ హత్నూర్, సోనాల నాలుగు మండలాల కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం బోథ్ పట్టణ కేంద్రంలోని షాదీ ఖానాలో నిర్వహించిన టీపీసీసీ ఉపాధ్యక్షులు పరిశీలకులు , ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందన్ పరిశీలకులు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణ ముఖ్య అతిథిలుగా పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలోపేతమే లక్ష్యంగా గ్రామ , మండల, బ్లాక్ , పట్టణ , జిల్లా అధ్యక్ష పదవులను భర్తీ చేసేందుకు ఆశావహుల నుండి దరఖాస్తులు స్వీకరించనున్నట్టు అతిథులు తెలిపారు. పార్టీలో ఉంటూ పార్టీకోసం కష్టపడే నాయకులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రతీ పదవికి ఐదు చొప్పున అప్లికేషన్లు స్వీకరించి అధిష్టానానికి పరిశీలనకు పంపుతామన్నారు .అనంతరం అధిష్టానం నిర్ణయం మేరకు పదవుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అనంతరం తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి నివాసంలో అతిథులను శ్రీకాంత్ రెడ్డి, ఆయన సోదరులు ప్రశాంత్ రెడ్డి లు శాలువాలతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జి ఆత్రం సుగుణక్క, ఆదిలాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి, బోత్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్, ఏఐసిసి సభ్యులు నరేష్ జాదవ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, మాజీ టిటిడి బోర్డు మెంబర్ అనిల్, బోథ్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, తలమడగు మాజీ జెడ్పిటిసి గోక గణేష్ రెడ్డి , బజార్ హత్నూర్ మాజీ జడ్పిటిసి నర్సయ్య, అధికార ప్రతినిధి పసుల చంటి, ఆదిలాబాద్ పట్టణ అధ్యక్షులు నగేష్, అన్ని మండలాల అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, యువజన కాంగ్రెస్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రీయ విద్యాలయ స్థల పరిశీలనలో భాగంగా జిల్లా కలెక్టర్‌ను కలిసిన కేంద్ర బృందం



అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ : జిల్లాలో కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు సంబంధించి గురువారం కేంద్రీయ విద్యాలయ దక్షిణ భారత విభాగం డిప్యూటీ కమిషనర్ మంజునాథం, అసిస్టెంట్ కమిషనర్ అనురాధ, జిల్లా కలెక్టర్ అభిలాషా అభినవ్‌ను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాసర మండలంలో కేంద్రీయ విద్యాలయ స్థాపనకు అవసరమైన స్థలాలను బృందం పరిశీలించిన విషయాన్ని కలెక్టర్‌కు వివరించారు. వసతి, మౌలిక సదుపాయాలపై చర్చించారు. కేంద్ర విద్యాలయ నిర్మాణానికి అనుకూలమైన ప్రాంతాన్ని గుర్తించేందుకు భౌగోళిక పరిస్థితులు, కమ్యూనికేషన్ సదుపాయాలు, భవిష్యత్ అవసరాలన్నిటినీ పరిగణనలోకి తీసుకుంటామని డిప్యూటీ కమిషనర్ తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు రత్న కళ్యాణి, కోమల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ రికార్డులు పకడ్బందీగా నిర్వహించాలి : జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పాలనాధికారి అభిలాష అభినవ్

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : రెవెన్యూ రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా మండలాల్లో పెండింగ్‌లో ఉన్న భూసమస్యలపై వివరాలు తెలుసుకున్నారు. భూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిశీలించి, అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. అటవీశాఖతో ఉన్న భూ వివాదాలపై రెవెన్యూ, అటవీశాఖల అధికారులు కలిసి సర్వే చేసి సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రతి మండలానికి సంబంధించిన భూముల వివరాలతో సమగ్ర ప్రొఫైల్ తయారు చేయాలని, ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. భూభారతి చట్టాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్న కుంటాల మండలంలో ప్రస్తుతం ఉన్న భూ సమస్యల పరిష్కార దశలను కలెక్టర్ అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీ కిషోర్ కుమార్, ఆర్డీఓ కోమల్ రెడ్డి, తహసిల్దార్లు, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా రక్షణ చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



ఆసిఫాబాద్ :అమృత్ తెలంగాణ: మహిళా రక్షణ చట్టాలపై ఉపాధ్యాయులు అవగాహన పెంచుకోవాలని విద్యార్థులను చైతన్యవంతులను చేయాలని ఆసిఫాబాద్ షీ టీం సభ్యురాలు స్వప్న అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల్లో భాగంగా మహిళ రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పిస్తూనే రక్షించుకోవడం ఎలాగో నేర్పాలన్నారు. విద్యార్థులు మొబైల్ ఫోన్ వాడకుండా వారిని ఎప్పటికప్పుడు నిరోధించేలా ప్రయత్నాలు చేయాలన్నారు. మహిళలు బాలికల రక్షణ కోసం ఫోక్సో లాంటి చట్టాలు ఉన్నాయన్నారు. పాఠశాలల్లో ప్రత్యేక కమిటీలు వేసి రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. మహిళల పట్ల సమాజంలో ఎవరైనా లేదా సహా ఉపాధ్యాయులు ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించిన వెంటనే షీ టీం గాని, ఐసి టీంని కానీ సంప్రదించాలన్నారు.

# బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే..

జన్నారం: అమృత్ తెలంగాణ: జన్నారం మండలంలోని కిష్టాపూర్, రాంనాయక్ తండా, సోనాపూర్, గ్రామానికి చెందిన వివిధ కారణాలతో పలువురు మృతి చెందిన కుటుంబాలను, అనారోగ్యంతో బాధపడుతున్న బాధిత కుటుంబాలను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పరామర్శించారు. మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆ కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ వైస్ చైర్మన్ పసియుల్లా పార్టీ అధ్యక్షులు ముజాఫర్ అలీ ప్రధాన కార్యదర్శి మాణిక్యం, బండారి స్వామి మామిడిపల్లి ఇందయ్యా రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# దళితులపై దాడులు చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి.......

**బుద్ధుడు విగ్రహాన్ని వెంటనే అదే ప్రదేశంలో ప్రతిష్టించాలి,...**
**అంబేద్కర్ యువజన సంఘం నాయకుల డిమాండ్..**




సమావేశంలో పాల్గొన్న ముధోల్ అంబేద్కర్ యువజన సంఘం నాయకులు

నిర్మల్ జిల్లా ముధోల్ మే 15 అమృత్ తెలంగాణ ముధోల్ మండలం లోని నాగార్జున నగర్ కమ్యూనిటీ హాల్ లో దళిత సంఘం నాయకుల భేటీ నిర్మల్ జిల్లా ముధోల్ మండల కేంద్రంలో నాగార్జున నగర్ కమ్యూనిటీ హాల్ లో ఈరోజు భేటీలో అంబేద్కర్ యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు బోరేగాం, గ్రామంలో జరిగినటువంటి గౌతమ బుద్ధుని యొక్క విగ్రహాన్ని తొలగించడం దానిపైనే చర్చించారు ఏదైతే బోరేగాం గ్రామంలో దళితులపై మరియు మహిళలపై జరిగినటువంటి దాడిని తీవ్రంగా ఖండించారు దళితులపై దాడి చేసిన వారికి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి రిమాండ్ కు పంపాలని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు ఏదైతే ప్రభుత్వ భూమిలో ఉన్నటువంటి బుద్ధ విగ్రహాన్ని తొలగించిన అధికారులు అలాగే అదే ప్రభుత్వ భూమిలో ఉన్నటువంటి అనుమాన్ విగ్రహాన్ని కూడా తొలగించాలని వారు డిమాండ్ చేశారు లేనియెడల బుద్ధ విగ్రహాన్ని ముందు ఉన్నచోటే ప్రతిష్టించాలని అభిప్రాయం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో మండల అంబేత్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు

# మాజీ తాజా కౌన్సిలర్ అంబకంటి అశోక్ సన్మానిస్తున్న తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీచైర్మన్



అంబకంటి అశోక్ మాజీ తాజా కౌన్సిలర్ సన్మానిస్తున్న దృశ్యం

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఆదిలాబాద్ పట్టణంలోని స్థానిక రవీంద్ర నగర్ కాలనీలో నివాసం ఉంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏఐసీసీ సభ్యులు డాక్టర్ నరేష్ జాదవ్ నివాసంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహర్ బిన్ హందన్ పాటు టీపీసీసీ జనరల్ సెక్రెటరీ చిట్ల సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది వారు జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు చేపడుతున్నటువంటి కార్యక్రమాలతోపాటు కార్యాచరణ మరియు దైనందిక కార్యక్రమాలను పరిగణలోకి తీసుకొని పార్టీ అధిష్టానానికి చేరవేసే ప్రయత్నంలో కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని గత 20 సంవత్సరాలుగా నిర్విఘ్నంగా హౌసింగ్ బోర్డ్ కౌన్సిలర్ గా అందరివాడిగా తనదైన ప్రత్యేక శైలని చూపెడుతూ ప్రజల పక్షాన నిలబడుతూ తనదైన మార్కును చూపట్టే శ్రీ అంబకంటి అశోక్ కుమార్ సన్మానించడం జరిగింది కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు

# బిజెపి మండల కార్యవర్గం ఎన్నిక



బిజెపి మండల అధ్యక్షుడిగా బర్కుంట నరేందర్,

నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి మే 15 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి మండల బిజెపి కమిటీ ఎన్నిక... బిజెపి నర్సాపూర్ మండల కార్యవర్గాన్ని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఆదేశాలతో జిల్లా అధ్యక్షులు రితీష్ రాథోడ్ ఈరోజు ప్రకటించడం జరిగింది. మండల అధ్యక్షులు గా బర్కుంట నరేందర్, ప్రధాన కార్యదర్శులుగా జంగోళ్ల మహిపాల్ రాంపూర్,భాశెట్టి విజయ్ గొల్లమాడ , ఉపాధ్యక్షులుగా దూసముడి సవీన్, చందు గౌడ్, పులి రంజిత్,సిందే ఛత్రపతి, కార్యదర్శులు గా బొల్లి గంగారాం,కళ్యాణ్ పటేల్, చరణ్, గంగారాం కోశాధికారిగా సంగెం అశోక్, సోషల్ మీడియా దయాకర్ మరియు 35మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు...

# ఎన్నికల గురించి తెలపడానికి రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య పక్కన కలాల శ్రీనివాస్ మరియు సంఘం నాయకులు

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ కమిటీ ఆదేశానుసారం రాష్ట్ర మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు కొండ దేవయ్య ఎన్నికల నియమావళి మరియు ఎన్నికల నియమ నిబంధనలు తెలుపడానికి తాలూకా మున్నూరు కాపు సంఘ భవనము లో ప్రెస్ మీట్ ఏర్పాటు చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో తాలూకా మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు కాళ్ల విఠల్ ,ప్రధాన కార్యదర్శి కలాల శ్రీనివాస్ ,కార్యవర్గ సభ్యులు,సంఘ నాయకులు,గ్రామ మరియు వార్డు అధ్యక్ష,కార్యదర్శులు పాల్గొనడం జరిగినది. కాళ్ల విఠల్ అధ్యక్షులు కలాల శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి తాలూకా మున్నూరు కాపు సంఘం ఆదిలాబాద్.

# పదోన్నతితో బాధ్యతలు మరింత అధికమవుతాయి - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్.

**ఎఆర్ లో 7 గురుకి కానిస్టేబుల్ నుండి హెడ్ కానిస్టేబుల్ పదోన్నతి**
**పదోన్నతి పొందిన అధికారులకు నిర్మల్ మరియు జగిత్యాల్ జిల్లాలకు బదిలీ.**
**పదోన్నతి పొందిన అధికారులకు శుభాకాంక్షలు తెలియజేసిన జిల్లా ఎస్పీ.**

అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ పదోన్నతితో బాధ్యతలు మరింత అధికమవుతాయని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలియజేశారు. గురువారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయం నందు ఏఆర్ కానిస్టేబుల్ నుండి హెడ్ కానిస్టేబుల్ పదోన్నతి పొందుతున్న 7 మంది అధికారులను పోలీసు ముఖ్య కార్యాలయానికి ఆహ్వానించి భుజాలకు పదోన్నతి చిహ్నాన్ని అలంకరించి అభినందనలు తెలియజేశారు. పదోన్నతి పొందిన అధికారులు ఎన్ కిషన్ రావు, ఎం అశోక్, జే దుదిరామ్, ఆర్ గోవింద్, ఎల్ దినేష్, ఎన్ అరవింద్, ఆర్ రామారావు ఉన్నారు. వీరందరికీ జిల్లా ఎస్ పీ పదోన్నతి పొందిన శుభ సంతోషం సమయంలో శుభాకాంక్షలు తెలియజేశారు. వీరందరికీ జోన్ పరిధిలో ఉన్న నిర్మల్ మరియు



పదోన్నతి పొందిన పోలీస్ అధికారులు

జగిత్యాల జిల్లాలలో ఖాళీలను బట్టి బదిలీలు కావడం జరిగింది. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి బి సురేందర్ రావు, సీసీ కొండరాజు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకులు, ఎంపీడీవో లు కో ఆర్డినేషన్ తో వచ్చిన దరఖాస్తులను నాలుగు రోజుల్లో పరిశీలించి , ఎలిజిబుల్, నాన్ ఎలిజిబుల్ లిస్ట్ ను తయారుచేయాలి:





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ రెండు షిఫ్ట్ లుగా ఆపరెటర్లను నియమించి దరఖాస్తులను పూర్తి చేయాలి: ఎంపీడీవో టీమ్, బ్యాంక్ అధికారుల సిబ్బంది కలసి బ్యాంకులకు పంపిన జాబితాను పరిశీలించి నివేదిక సమర్పించాలిబీ ఎన్ని దరఖాస్తులు వచ్చాయి ఎన్ని దరఖాస్తులు పరిశీలించారు రోజువారీ నివేదిక సమర్పించాలి బీ జిల్లా పాలనాధికారి రాజర్షి షా రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన పై ప్రత్యేక అధికారులు, ఎంపీడీవో లు, బ్యాంక్ మేనేజర్లు, అధికారులతో గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఐటిడిఎ పిఓ ఖుష్బూ గుప్తా తో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల లెవెల్లో పరిశీలించిన దరఖాస్తుల వివరాలను సంబంధిత బ్యాంకులకు తదుపరి చర్య నిమిత్తం పంపాలని అన్నారు . జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకం కింద నమోదైన అన్ని దరఖాస్తులను పూర్తిస్థాయిలో బ్యాంకర్లు, ఎంపిడిఓ లు సోమవారం 19వ తేదీలోగా పూర్తిగా పరిశీలన జరపాలని అందుకు బ్యాంకర్లకు అనువుగా ఇద్దరు ఆపరేటర్లను నియమించి ఉదయం, సాయంత్రం షిఫ్ట్ వారీగా విధులు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. రాజీవ్ యువ వికాసం కింద నమోదు కాబడిన దరఖాస్తుల సంఖ్య 48,296 ఇందులో నేటి వరకు 43,417 వేలు (డెస్క్ వెరిఫికేషన్) దరఖాస్తులను మండల స్థాయిలో పరిశీలించడం జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు బ్యాంకులకు పంపించిన దరఖాస్తులు 32,283. బ్యాంక్, ఎంపీడీవో ఆపరెటర్ల సహకారం తో వచ్చిన దరఖాస్తులను బ్యాంక్ మేనేజర్లు పరిశీలన ప్రక్రియ వేగవంతం చేసి సోమవారం లోగా జాబితాను అందించాలని అన్నారు. బ్యాంకుల ద్వారా జాబితా పూర్తయిన తరువాత ఎంపీడీవో లు ఫైనల్ జాబితా తయారుచేసి పంపాలని తెలిపారు. సమావేశం లో ED ఎస్సి కార్పోరేషన్ మనోహర్, సీఈఓ జితెందర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఉత్పల్ కుమార్, బ్రాంచ్ మేనేజర్ లు, మున్సిపల్ కమిషనర్, సీవీయన్ రాజు, ప్రత్యేక అధికారులు, ఎంపీడీవో లు, ఎంపిఓ లు, ఈ సమావేశం లో గూగుల్ మీట్ ద్వారా అన్ని మండలాల బ్యాంక్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారిణి అదిలాబాద్ గారి చే జారీ చేయనైనది.

# రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపికను వేగవంతం చేయండి: అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్






హాజరైన అధికారులు

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : రాజీవ్ యువ వికాసం పథకానికి అర్హులైన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆయన ఈ పథకం లబ్ధిదారుల ఎంపికపై జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. దరఖాస్తుల పరిశీలన, ప్రస్తుత స్థితిగతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, మండలాల వారీగా ఎంపిక ప్రక్రియను రేపటిలోగా పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, అర్హులైనవాటిని బ్యాంకులకు పంపించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. బ్యాంకులకు చేరిన దరఖాస్తుల పరిశీలనను త్వరగా పూర్తిచేయాలని బ్యాంకు అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ గోవింద్, లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, మండలాల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, బ్యాంకర్లు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా గంజాని రవాణా చేస్తున్న వ్యకి అరెస్ట్

అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ : జి.లింబాద్రి కి ఒక నమ్మదగిన సమాచారం ఒక వ్యక్తి కడం వైపు నుండి ఆటో లో నిషేధిత గంజా తీసుకోని నిర్మల్ వైపు రాగా సిబ్బంది ASI బాబారావు, HC రాజేశ్వర్ PCs సంతోష్,అజిజ్,జితేందర్, లు కలిసి కొండాపూర్ వద్ద ఆటో B.N TS 01UC 0868 ను పట్టుకొని తనిఖీ చేసి నిషేదిత గంజాయి ఉన్నా బదల నూర్ సింగ్ వయస్సు:45సం, వృత్తి: ఆటో డ్రైవర్, నివాసం: చింతగూడ తండా ,అల్లంపల్లి గ్రామం కడం మండల వ్యక్తిని కొండాపూర్ బ్రిడ్జి దగ్గర పట్టుకోవడం జరిగినది. అతని వద్ద నుండి సుమారు 1.907 కేజీల ఎండు గంజాయిని స్వాధీనపరచుకోవడమైనది. ఈ కేసు విషయములో ASP నిర్మల్ రాజేష్ మీనాIPS గారి నేతృత్వములో సమాచారం సేకరించి గంజాయి రవాణా చేసిన వ్యక్తి అరెస్టు చేసిన నిర్మల్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ మున్నూరు కృష్ణ, SI జి.లింబాద్రి, మరియు సిబ్బంది ASI బాబారావు ,HC రాజేశ్వర్ PCs సంతోష్, అజీజ్,జితేందర్ బాలాజీ లను నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జానకి షర్మిల ఐపిఎస్ గారు అభినందించారు మరియు నిర్మల్ జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చాలని గంజాయి అమ్మేవారిపై ఉక్కు పాదం మోపాలని సూచించారు. ఇట్లు.. ASP నిర్మల్ రాజేష్ మీనాIPS.




# భోరజ్ మండలం రాంపూర్ టి, ఫౌజాపూర్ గ్రామాలలో గురువారం భూ భారతి రెవెన్యు సదస్సులో పాల్గొని దరఖాస్తులను జిల్లా కలెక్టర్ రాజర్షి షా.పరిశీలించారు..

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : ఈ సందర్భంగా రెవెన్యూ గ్రామసభల ద్వారా అర్జీలను స్వీకరించి నూతన చట్టం ప్రకారం భూ సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. భోరజ్ పైలెట్ మండలంగా ఎంపికైన నేపథ్యం లో మండలాల్లోని గ్రామాలను రోజువారీగా దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఈ సందర్భంగా రాంపూర్ టి, ఫౌజ్ పూర్ గ్రామాలను సందర్శించి ఏర్పాటు చేసిన భూ భారతి రైతు సదస్సులో పాల్గొని రైతుల నుండి స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించారు. భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు, ప్రజలు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని , రాష్ట్ర వ్యాప్తంగా భూ భారతి చట్టం అమలులో భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భూ సమస్యలు ఉన్నవారు రెవెన్యూ సదస్సులో పాల్గొనాలని, దరఖాస్తులు స్వీకరించి నూతన చట్టం ప్రభుత్వ ఆదేశాల ప్రకారం భూ సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు, గతంలో ప్రజలు తహసీల్దార్,ఆర్డీఓ లేదా కలెక్టర్ కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేదని, కానీ ఇప్పుడు అధికారులు స్వయంగా తమ తమ గ్రామాలకే వచ్చి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలులోకి తెచ్చిన భూ భారతి చట్టం కింద రైతులు, ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలన జరిపిన మీదట, క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేయాలని కలెక్టర్ రెవెన్యూ బృందాలను ఆదేశించారు. భూ భారతి పైలెట్ ప్రాతిపాదికన భోరజ్ మండలం రాంపూర్ టి, ఫౌజపూర్ గ్రామాలలో నిర్వహించిన రైతు సదస్సుల సందర్భంగా వచ్చిన దరఖాస్తులను ప్రభుత్వ మార్గదర్శకాలను




తు.చ తప్పకుండా పాటిస్తూ, నూతన ఆర్ఓఆర్ చట్టంలో పొందుపర్చిన నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించాల్సి ఉంటుందని అన్నారు. రెవెన్యూ అధికారులు, సిబ్బందితో కలెక్టర్ సమావేశమై భూ భారతి దరఖాస్తుల పరిశీలన, విచారణ అంశాలపై మార్గనిర్దేశం చేశారు. రెవెన్యూ గ్రామాలలో నిర్వహించిన సదస్సుల సందర్భంగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. వీటిని క్షుణ్ణంగా పరిశీలించి, పక్కాగా ఫీల్డ్ వెరిఫికేషన్ నిర్వహించాలని, ప్రతి అంశాన్ని ఎంతో జాగ్రత్తగా, సమగ్రంగా పరిశీలించాలని హితవు పలికారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, భూ భారతి లోని నిబంధనల పై పరిపూర్ణమైన అవగాహనను కలిగి ఉన్నప్పుడే, తప్పిదాలకు తావులేకుండా దరఖాస్తుల పరిశీలన, విచారణ ప్రక్రియలను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ముందుగా డెస్క్ వర్క్ ద్వారా రెవెన్యూ రికార్డులతో దరఖాస్తులో వివరాలను సమగ్రంగా పరిశీలన చేసుకోవాలని, అనంతరం క్షేత్రస్థాయికి వెళ్లి నిబంధనలకు అనుగుణంగా విచారణ జరపాలన్నారు. భూ భారతి చట్టంలో అప్పీల్ వ్యవస్థను అమలు చేస్తున్నందున, ప్రతి దరఖాస్తును ఎంతో జాగ్రత్తగా పరిష్కరించాల్సి ఉంటుందని, దరఖాస్తుదారుడు తిరిగి అప్పీలుకు వెళ్లే పరిస్థితి ఉత్పన్నం కాకుండా నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా విచారణ జరిపి వాస్తవ పరిస్థితులతో కూడిన అభిప్రాయాలను నివేదికలో పేర్కొనాలని కలెక్టర్ సూచించారు. క్షేత్రస్థాయి పరిశీలన, విచారణ ప్రక్రియలు నిర్వహించే సమయంలో ప్రతి ఒక్కరు సంయమనంతో వ్యవహరించాలని అన్నారు. సాదా బైనామాలు, పీ.ఓ.టీ దరఖాస్తులకు సంబంధించి రికార్డుల పరిశీలన, సాధారణ విచారణలు మాత్రమే జరపాలని, హైకోర్టులో స్టే తొలగిన మీదట, ప్రభుత్వం వెలువరించే మార్గదర్శకాలకు అనుసరిస్తూ సాదా బైనామా, పీ.ఓ.టీలను క్రమబద్ధీకరించడం జరుగుతుందని దరఖాస్తుదారులకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. ఒకే దరఖాస్తులో ఒకటికంటే ఎక్కువ సంఖ్యలో భూ సమస్యలను పొందుపరిస్తే, ప్రతి సమస్యను తప్పనిసరిగా పరిశీలిస్తూ వేర్వేరుగా విచారణ జరపాలని అన్నారు. దరఖాస్తుల పరిశీలన, క్షేత్రస్థాయి విచారణ ప్రక్రియలు చేపట్టి, వారం రోజుల్లో పూర్తి చేయాలని, క్షేత్రస్థాయి విచారణలో జాప్యానికి తావులేవులేకుండా, రెవెన్యూ బృందాలు సమన్వయంతో పని చేస్తూ నిర్ణీత గడువులోపు దరఖాస్తుల పరిశీలన, విచారణలు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. రెవెన్యు సదస్సులో rdo వినోద్ కుమార్, తహసీల్దార్లు రాజేశ్వరి, నలంద ప్రియ , రెవెన్యు సిబ్బంది,రైతులు, గ్రామస్తులు, తదితరులు రైతులు పాల్గొన్నారు.

# వేసవి వ్యాధులు - తీసుకోవాల్సిన జాగ్రత్తలు



వేసవి ఎండలతో అనేక రుగ్మతలు వ్యాపిస్తుండటం సహజం. డీ హైడ్రేషన్ నుంచి ఫుడ్ పాయిజనింగ్ వరకూ కొన్ని వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. చాలా వ్యాధులు వైరస్‌ల వల్ల వస్తాయి. పరిశుభ్రతకు ఎక్కువ శ్రద్ధ వహించాలి. తరచుగా చేతులు, కాళ్లు కడుక్కోవాలి. ప్రయాణం చేసేటప్పుడు హ్యాండ్ శానిటైజర్ ఉపయోగించటం మర్చిపోవద్దు. శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుకోవటం చాలా అవసరం. వేసవిలో ఎదురయ్యే ఆరోగ్య సమస్యల వివరాలు ఇవిగో

వడదెబ్బ (సన్‌స్ట్రోక్) : ఎండలో ఇష్టానుసారంగా తిరిగినా, నీరు తక్కువగా తీసుకున్నా వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంది. శరీర ఉష్ణోగ్రత 104 డిగ్రీల కంటే ఎక్కువగా ఉన్నా, అయోమయం, గుండె వేగంగా కొట్టుకోవడం, శ్వాస తీసుకోవటంలో ఇబ్బంది, చెమట పట్టకపోవటం, కాళ్ళూ చేతుల నొప్పులు, శరీరం తిమ్మిరి, వాంతులు, తలనొప్పి, స్పృహకోల్పోవటం వంటివి వడదెబ్బ లక్షణాలు. వడదెబ్బ తగిలిన వ్యక్తి శరీరాన్ని చల్లబర్చాలి. తడిగుడ్డతో శరీరమంతా తుడవాలి. నీళ్లు తాగించి వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లటం ఉత్తమం. ఈ సమస్య రాకుండా ఉండాలంటే తీరు ఎక్కువగా తాగాలి. నిమ్మరసం, కొబ్బరినీరు, గ్లూకోజ్ డి వంటివి తీసుకోవాలి. ఇంట్లో ఎలక్ట్రోరల్ ఫౌడర్ లేదా ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉంచుకోండి. అవి అందుబాటులో లేకపోతే చక్కెర, ఉప్పు కలిపిన నీరు తాగండి.

విషాహారం (ఫుడ్‌పాయిజనింగ్) : ఆహారం ద్వారా వ్యాపించే వ్యాధులు వేసవిలో సాధారణం. ఇవి ఎక్కువగా హానికారక బ్యాక్టీరియా, పరాన్నజీవుల వల్ల వస్తాయి. అధిక వేడికారణంగా ఆహారం త్వరగా పాడవుతుంది. అలాంటి ఆహారం తీసుకోవటం వల్ల ఫుడ్ పాయిజనింగ్ అయ్యే ప్రమాదం ఉంటుంది. ఆహారం చెడిపోకుండా చూసుకోవాలంటే బాగా ఉడికించాలి. వండిన ఆహారాన్ని బయట వేడిలో ఉంచినప్పుడు బ్యాక్టీరియా పెరుగుతుంది. ఈ సమస్యను అధిగమించేందుకు తాజా ఆహారాన్ని తినటం ముఖ్యం. మసాలాలతో కూడిన ఆహారాన్ని తగ్గించాలి.

కంటి ఇన్ఫెక్షన్ : ఈ కాలంలో కనిపించే కొన్ని సాధారణ కంటి వ్యాధుల్లో కంటి వాపు, అలెర్జీ, కంజక్టివైటిస్ ఉంటాయి. తగినంత విశ్రాంతి కళ్లకు ఇవ్వాలి. వాటిపై ఒత్తిడి తగ్గించాలి. మీ కళ్ళు, ముఖాన్ని క్రమం తప్పకుండా శుభ్రమైన నీటితో కడగాలి. ఎండలో బయటకు వెళ్తే కళ్లజోడు వాడటం మంచిది. సమస్యలు వస్తే డాక్టరు సిఫారసు మేరకు ఐడ్రాప్స్, మందులు వాడాలి.

చర్మ సమస్యలు : సూర్యుడి అతినీలలోహిత కిరణాలు వల్ల చర్మంలోని కణాలు దెబ్బతింటాయి. ఎండలో ఎక్కువగా తిరిగితే చర్మం కమిలిపోతుంది. అధిక తేమ, వేడి కారణంగా చర్మంపై ఎరుపు దద్దుర్లు, స్వేద గ్రంథులు మూసుకుపోవటం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. చెమట వల్ల మచ్చలు, దురద మంట వస్తుంది. చర్మ సమస్యలు రాకుండా ఉండా లంటే వేసవిలో సన్‌స్క్రీన్ లోషన్లు వంటివి కూడా ఉపయోగించొచ్చు. వాడిన దుస్తులను ఉతక్కుండా మళ్లీ వాడకూడదు. చెమట ఎక్కువగా పడుతున్నందున స్నానం రెండుమూడు సార్లు చేయొచ్చు. శరీరానికి గాలి తగిలేలా వదులైన, చెమట పీల్చే కాటన్ దుస్తులు ధరించటం మేలు.

అతిసార : ఎండవేడి కారణంగా ఆహారం త్వరగా పాడైపోతుంది. అలాంటి ఆహారం తీసుకుంటే వేసవిలో విరోచనలు సాధారణం. కలుషిత ఆహారం తినటం, నీరు తాగటం, మద్యపాన అలవాట్లు డయేరియాకు దారితీస్తాయి. అతిసారం నుంచి దూరంగా ఉండటానికి నీటిని మరిగించిన తర్వాత మాత్రమే తాగటం అలవాటుగా చేసుకోవాలి. కూరగాయలను ముక్కలుగా చేయటానికి ముందు, తర్వాత వాటిని బాగా కడగాలి. ఇళ్లల్లో ఆహార పదార్థాలపై ఈగలు వాలకుండా చూసుకోవాలి. పాడైనవి కాకుండా వేడి వేడి ఆహార పదార్థాలు తీసుకోవటం మేలు.

చికెన్‌పాక్స్ : చికెన్‌పాక్స్ (అమ్మోరు) చాలా సాధారణ వేసవి వ్యాధుల్లో ఒకటి. ఇది అధిక జ్వరంతో శరీరంపై ఎరుపురంగులో ఉండే చిన్న దద్దుర్ల రూపంలో ప్రారంభమవుతుంది. ఇది పిల్లల్లో తక్కువ రోగ నిరోధకశక్తి ఉన్న వారిలో సాధారణంగా కనిపిస్తుంది. ఇది అంటువ్యాధి. అందువల్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. ఇది సోకినప్పుడు బయటకు తిరగకుండా ఇంట్లో ఉండటమే మేలు. మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. త్వరగా తగ్గే వీలుంది.

తట్టు : మీజిల్స్ మరో సాధారణ వేసవి వ్యాధి. మీజిల్స్‌కు కారణమయ్యే పారామిక్సో వైరస్ వేసవిలో వేగంగా సంతానోత్పత్తి చేస్తుంది. దీని ప్రారంభ లక్షణాలు దగ్గు, అధిక జ్వరం, గొంతునొప్పి, కళ్లు ఎర్రబడటం, తరువాతి దశలో, చిన్న తెల్లటి మచ్చలు ఏర్పడతాయి. మీజిల్స్ దద్దుర్లు శరీరం అంతటా కనిపిస్తాయి. మందులు వాడితే తగ్గిపోతుంది.

కామెర్లు : నీటి ద్వారా సంక్రమించే వ్యాధి. ఇది హైపటైటిస్ ఎ వల్ల వస్తుంది. ప్రధానంగా కలుషిత మైన ఆహారం, నీటి వినియోగం వల్ల వస్తుంది. సకాలంలో చికిత్స చేయకపోతే ఈ వ్యాధి కాలేయం పనితీరును ప్రభావితం చేస్తుంది. ఇది పిత్తం అధిక ఉత్పత్తికి దారితీస్తుంది.

టైఫాయిడ్ : జ్వరం వస్తే సొంత వైద్యంతో నిర్లక్ష్యం చేయొద్దు. జ్వరంతోపాటు తలనొప్పి, నీరసంగా ఎక్కువగా ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. అపరిశుభ్ర ఆహారం, నీరు తీసు కోవటం వల్ల ఈ సమస్య వస్తుంది. కలుషిత ఆహారం, నీటి వనరులు బ్యాక్టీరియాకు సంతానోత్పత్తికి ప్రదేశంగా మారతాయి. టైఫాయిడ్ వస్తే బలహీనత, ఆకలిలేకపోవటం, కడుపులో నొప్పి, అధిక జ్వరం వంటి లక్షణాలు కన్పిస్తాయి.

గవదబిళ్ళలు : వేసవి వ్యాధుల్లో గవదబిళ్లలు అత్యంత అంటువ్యాధి. ఈ వైరల్ వ్యాధి పిల్లలను ప్రభావితం చేస్తుంది. ఈ అంటువ్యాధి సోకిన వ్యక్తి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు వ్యాపిస్తుంది. లాలాజల గ్రంథివాపు, కండరాలనొప్పి, జ్వరం, తలనొప్పి, ఆకలి లేకపోవటం, బలహీనత వంటి లక్షణాలు కన్పిస్తాయి.

తలనొప్పి : అధిక ఉష్ణోగ్రతలతో తలనొప్పి ఎక్కువగా కనిపిస్తుంది. వేడి వల్ల వచ్చే తలనొప్పి శరీరం వేడికి ప్రతి స్పందించటం వల్ల కూడా వస్తుంది.

పైన పేర్కొన్న వ్యాధులకు అధునాతనమైన మందులు అందుబాటులో ఉన్నాయి. డాక్టరు సలహా మేరకు వాటిని ఉపయోగిస్తే అవి నియంత్రణలోకి వస్తాయి.

ఈ చిట్కాలు పాటించండి

తరచూ మంచినీరు, నిమ్మకాయ ద్రావణంతోపాటుగా ఎక్కువ మజ్జిగ తీసుకోవాలి

నారింజ, దానిమ్మ వంటి పండ్లను తినాలి

మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకూ బయటకు వెళ్లకండి

క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి

సూర్యకాంతికి గురి కావడాన్ని తగ్గించండి. ఉదయం లేదా సాయంత్రం మాత్రమే వ్యాయామం వంటి కార్యక్రమాలను చేయండి.

కళ్ల సంరక్షణ కోసం కూలింగ్ గ్లాసులు పెట్టుకోవాలి

లేతరంగు, తేలికైన వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి

బ్యాక్టీరియాతో ఉండే స్ట్రీట్‌ఫుడ్ తినొద్దు

ప్యాకింగ్ చేసిన పండ్లు, కూరగాయలు తీసుకోవద్దు


పండ్లు, కూరగాయల వినియోగాన్ని పెంచండి.

ఆల్కాహాల్, కెఫైన్ తీసుకోవద్దు

కూల్‌డ్రింక్స్ తాగొద్దు.


డాక్టర్ జి.అర్చన మాధురి, ఎంబిబిఎస్, ఎండి డివిఎల్, డెర్మటాలజిస్ట్,
కాస్మోటిక్ కేర్ స్పెషలిస్ట్, విజయవాడ

## త్రిధ అందాల విన్యాసాలు



తెలుగు ప్రేక్షకులకు సూర్య వర్సెస్ సూర్య సినిమా తో పరిచయం అయిన ముద్దుగుమ్మ త్రిధ చౌదరి. తెలుగు లో మొదటి సినిమా తో ఆశించిన స్థాయిలో గుర్తింపును దక్కించుకోవడంలో విఫలం అయ్యింది. అయినా కూడా ఈమెకు ఆఫర్లు వచ్చాయి. బెంగాళి లో కంటిన్యూస్ గా ఆఫర్లు వస్తున్నా కూడా తెలుగు లో నటించాలనే ఆకాంక్ష తో మనసుకు నచ్చింది సినిమా తో మళ్లీ తెలుగు లో ఎంట్రీ ఇచ్చింది. మూడేళ్ల గ్యాప్ తర్వాత మనసుకు నచ్చింది సినిమా తో టాలీవుడ్ లో రీ ఎంట్రీ ఇచ్చిన త్రిధ చౌదరి హీరోయిన్ గా బ్యాక్ టు బ్యాక్ సినిమాలు అప్పటి నుండి చేస్తూనే ఉంది. బెంగాళి.. తమిళ చిత్రాలతో పాటు తెలుగు లో కూడా నటిస్తూ తాజాగా బాలీవుడ్ మోస్ట్ క్రేజీ మూవీ షంషేర సినిమా తో హిందీ సినిమా రంగంలో అడుగు పెట్టేందుకు సిద్ధం అయ్యింది. హీరోయిన్ గా త్రిధ చౌదరి సినిమాలతో స్టార్ గా పాపులారిటీని దక్కించుకోలేక పోయినా కూడా సోషల్ మీడియా పోస్ట్ ల ద్వారా మంచి పాపులారిటీని దక్కించుకుంది.

## చిరులో అది నాకు బాగా నచ్చిందంటున్న రెజీనా!



రెజీనా కసాండ్రా.. తెలుగు తమిళ సినీ ప్రియులకు ఈ ముద్దుగుమ్మ గురించి పరిచయాలు అవసరం లేదు. శివ మనసులో శృతి మూవీతో సినీ కెరీర్ ను ప్రారంభించిన రెజీనా. పిల్లా నువ్వు లేని జీవితం సుబ్రహ్మణ్యం ఫర్ సేల్ లాంటి చిత్రాల ద్వారా టాలీవుడ్ లో సూపర్ క్రేజ్ దక్కించుకుంది. మరోవైపు కోలీవుడ్ లోనూ వరుస సినిమాలు చేస్తూ మంచి గుర్తింపు సంపాదించుకుంది. రీసెంట్ గా ఈ బ్యూటీ అన్యాన్ ట్యుటోరియల్ అనే వెబ్ సిరీస్ తో ప్రేక్షకులను పలకరించింది. ప్రముఖ తెలుగు ఓటీటీ సంస్థ ఆహా వేదికగా స్ట్రీమింగ్ అయిన ఈ హారర్ థ్రిల్లర్ సిరీస్ కు చక్కటి స్పందన లభిస్తోంది. ఇకపోతే రెజీనా తాజాగా పాపులర్ టీవీ షో ఆలీతో సరదాగా లో పాల్గొంది. ఈ సందర్భంగా ఆమె వృత్తిపరమైన విషయాలే కాకుండా వ్యక్తిగత జీవితానికి సంబంధించి ఎన్నో ఇంట్రస్టింగ్ విషయాలను సైతం అందరితోనూ షేర్ చేసుకుంది. అయితే ఈ క్రమంలోనే హోస్ట్ ఆలీ ఆచార్య సినిమాలో మెగా స్టార్ చిరంజీవి గారితో కలిసి పని చేయడం ఎలా అనిపించింది..? అని ప్రశ్నించాడు. కొరటాల శివ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న కమర్షియల్ ఎంటర్టైనర్ చిత్రమే ఆచార్య ఇందులో సానా కష్టం అనే స్పెషల్ సాంగ్ లో రెజీనా చిరుతో కలిసి చిందులేసింది. ఈ నేపథ్యంలోనే ఆలీ చిరుతో వర్క్ ఎక్స్పీరియన్స్ గురించి ప్రశ్నించగా.. రెజీనా బదులిస్తూ ఈ వయసులోనూ చిరంజీవి గారు ఏ విషయాన్ని అయినా.. చాలా త్వరగా నేర్చుకుంటారు. అది నాకు బాగా నచ్చింది. ఆ విషయంలో ఆయనను మెచ్చుకోవాల్సిందే. ఆయనతో కలిసి వర్క్ చేయడం నాకు గొప్ప అనుభూతిని ఇచ్చింది అంటూ చెప్పుకొచ్చింది. దీంతో ఇప్పుడీమె కామెంట్స్ నెట్టింట వైరల్ గా మారాయి. కాగా రెజీనా సినిమాల విషయానికి వస్తే.. ప్రస్తుతం ఈ బ్యూటీ తెలుగు తమిళ భాషల్లో నేనే నా అనే చిత్రం చేస్తోంది. తెలుగులో శాకినీ ఢాకినీ అనే మూవీతో పాటు తమిళంలో ఓ మూడు ప్రాజెక్ట్స్ ను టేకప్ చేసింది. అలాగే మరోవైపు బాలీవుడ్ లో షూర్ వీర్ వెబ్ సిరీస్ లో నటిస్తోంది. కనిష్క్ వర్మ ఈ సిరీస్ ను రూపొందించారు. ఇటీవల బయటకు వచ్చిన ఈ సిరీస్ ట్రైలర్ మంచి ఆదరణ దక్కించుకుంది. జూలై 15 నుంచి హాట్ స్టార్ లో ఈ సిరీస్ స్ట్రీమింగ్ కాబోతోంది.

## నాని సరైన ప్లానింగ్ తో వెళ్లడం లేదా..?



సూపర్ సీనియర్ హీరోలు - స్టార్ హీరోలను పక్కన పెడితే.. టాలీవుడ్ లో ఐదారుగురు టైర్-2 హీరోలు ఉన్నారు. రెగ్యులర్ గా సినిమాలు చేస్తూ ఏడాది పొడవునా ప్రేక్షకులను అలరించేది వీరి చిత్రాలే. ఈ జాబితాలో నేచురల్ స్టార్ నాని ముందు వరుసలో ఉంటాడని చెప్పాలి. కెరీర్ ప్రారంభం నుంచీ విభిన్నమైన చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తున్న నాని.. తనకంటూ ప్రత్యేకంగా మార్కెట్ ను క్రియేట్ చేసుకున్నాడు. త్వరలోనే టైర్-1 హీరోల లీగ్ లో చేరుతాడని అందరూ అనుకున్నారు. కానీ ఇటీవల కాలంలో అతని సినిమాలు - మార్కెట్ ను పరిశీలిస్తే టైర్-2 హీరోగానే ఉండిపోతాడేమో అనే కామెంట్స్ వస్తున్నాయి. 'వి' 'టక్ జగదీశ్' వంటి రెండు సినిమాలను బ్యాక్ టూ బ్యాక్ డైరెక్ట్ ఓటీటీలో రిలీజ్ చేసిన నాని.. 'శ్యామ్ సింగరాయ్' మరియు 'అంటే సుందరానికి' చిత్రాలను థియేట్రికల్ రిలీజ్ చేశారు. అయితే థియేట్రికల్ విడుదలైన రెండు చిత్రాలు నిరాశ పరిచాయి. హిట్ టాక్ తెచ్చుకొని కూడా వసూళ్ళు రాబట్టలేకపోయాయి. కనీస ఓపెనింగ్స్ కూడా అందుకోకపోవడంతో ఇది నాని మార్కెట్ పై ప్రభావం చూపిస్తుందని కామెంట్స్ వినిపిస్తున్నాయి. పాజిటివ్ టాక్ వచ్చిన సినిమాలు కూడా కలెక్షన్స్ రాబట్టలేకపోయాయంటేనే ప్రెజెంట్ నాని మార్కెట్ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని అంటున్నారు. అయితే ఇలాంటి పరిస్థితి రావడానికి కారణం నాని సరైన ప్లానింగ్ తో ముందుకు వెళ్లకపోవడమే అనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. నాని వరుస సినిమాలు చేస్తున్నాడు కానీ.. స్టార్ డైరెక్టర్లతో ప్రాజెక్ట్స్ సెట్ చేసుకోవడం లేదు. అంతగా క్రేజ్ లేని దర్శకులతో కొత్తవారితో ఎక్కువగా పని చేస్తున్నాడు. పర్యవసానంగా నాని మినిమమ్ ఓపెనింగ్స్ తో సరిపెట్టుకోవాల్సి వస్తోంది. ప్రస్తుతం నటిస్తున్న 'దసరా' మూవీ కూడా డెబ్యూ డైరెక్టర్ తో చేస్తున్నదే.

## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

## ఎల్లోర వంటి అందం ఈమె సొంతం



ఒకప్పుడు హీరోలతో పోల్చితే హీరోయిన్స్ తక్కువ కాలంకు రిటైర్ అయ్యే వారు. రిటైర్ అయిన హీరోయిన్స్ కనీసం కంటికి కనిపించకుండా వెళ్లి పోయేవారు. పెళ్లి చేసుకుని విదేశాల్లో వైవాహిక జీవితాన్ని గడిపేవారు. కాని ఇప్పుడు పరిస్థితి వేరు. హీరోలకు ఏమాత్రం తక్కువ కాకుండా హీరోయిన్స్ కూడా అత్యధిక కాలం పాటు ఇండస్ట్రీలో కొనసాగుతున్నారు. సోషల్ మీడియా పుణ్యమా అని నాలుగు పదుల వయసులో కూడా స్టార్ లుగా చలామణి అవుతున్న వారు చాలా మంది ఉన్నారు. అందమైన హీరోయిన్స్ వయసు పెరిగినా కూడా అందం తగ్గకుండా మెయింటెన్ చేస్తూ వర్కౌట్స్ చేస్తూ అద్బుతంగా తమ యొక్క ఫిజిక్ ను మెయింటెన్ చేస్తున్నారు. మలైక అరోరా.. ఈమె గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. దేశ వ్యాప్తంగా మంచి పాపులారిటీని దక్కించుకున్న ఈ అమ్మడు అయిదు పదుల వయసుకు చేరువ అయ్యింది. మరో రెండేళ్లలో అయిదు పదుల సంవత్సరాలను క్రాస్ చేస్తుంది. అయినా కూడా అందం విషయంలో పాతికేళ్ల అమ్మాయిలతో ఈమె పోటీ పడుతోంది. తాజాగా ఇలా ఎల్లోర శిల్పం మాదిరిగా అందాల ఫోజ్ ఇచ్చి అందరిని ఆశ్చర్య పర్చింది. నాలుగు పదుల వయసులో కూడా ఎంతో మంది హీరోయిన్స్ ఇలా అందంగా కనిపించడం మనం చూస్తున్నాం.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com